
కథ



# ప్రియురాలు పిలిచె రావోయీ.....

చంపక్

సాయంకాలం ఆఫీసు నుంచి ఇంటికొచ్చిన రవికి కాఫీ ఇచ్చి, "రజనికి పెళ్లట. శుభలేఖ వచ్చిందిరా" అంది అమ్మ.

ఉలిక్కిపడ్డాడు రవి.

రజని! ఏనాటి రజని!

కాఫీ తాగుతూన్నా - రవి ఆలోచనలు రామాపురానికి దూసుకుపోయాయి.

తను అక్కడే పుట్టి పెరిగాడు. రోడ్డు లేదు. బస్సు రాదు. కరెంట్ నాస్తి. వర్షం పడితే అంతా బురద. అయితేనేం ~ జన్మనిచ్చిన తల్లిలాంటిదే జన్మభూమి కూడా. అందుకే ఆ ఊరంటే ఇష్టం. ఆ ఊరు, దానితో బాటు రజని - తన హృదయంలో పచ్చబొట్టులా పదిలం! శాశ్వతం!

రామాపురంలో తమ పక్కింటి రైతు రామయ్య కూతురే రజని. తనూ, ఆమె కలిసే స్కూల్‌కి వెళ్లేవారు. స్కూల్ అయ్యాక ఇద్దరూ రామాలయానికి వెళ్లి గుడి వెనక మందారమొక్క వద్ద కూర్చుని ప్రసాదం తినేవారు. ఇంటి నుండి తెచ్చిన వేరుశనగ ఉండలో, జీళ్లో రజని ఇచ్చేది. తను ఆమె హోంవర్క్ చేసి పెట్టేవాడు.

ఆమె దృష్టిలో రవి ఒక బాలమేధావి అయితే ఆతని దృష్టిలో ఆమె ఒక అందాలబొమ్మ!

ఆ ఊరి స్కూల్‌లో ఐదోక్లాస్ వరకే ఉంది. పై చదువులు - రెండు మైళ్ల దూరంలోని దుర్గాడలో. అబ్బాయిలు సైకిళ్లమీద వెళ్లేవారు కాని అమ్మాయిల చదువు ఐదుతో ఆగిపోయేది.

అయితే రజని నిరాహారదీక్ష చేసి తల్లిదండ్రుల్ని ఒప్పించి మరీ దుర్గాడ స్కూల్‌లో చేరింది. పట్టుదలగా సైకిల్ తొక్కడం నేర్చుకుంది. ఆ ఊళ్లో ఐదు దాటి చదివిన తొలి అమ్మాయిగా, సైకిల్ తొక్కడం నేర్చిన ప్రథమ బాలికగా చరిత్ర సృష్టించింది రజని.

రామాపురం, దుర్గాడలను కలుపుతూ వంకరటింకర మట్టిరోడ్డు. సగందూరంలో మలుపు తిరిగే చోట పెద్దజువ్విచెట్టు. దానిపక్కనే మంచినీళ్లబావి. నీళ్లు తోడుకోవడానికి తాటాకు చేద.

స్కూల్ అవ్వగానే దుర్గాడ నుంచి వస్తూ జువ్విచెట్టు వద్ద ఆగి, సైకిళ్లు చెట్టుకి చేరవేసి ముఖాలు కడుక్కొని చెట్టుకింద కూర్చుని హోంవర్క్ చేసుకునేవారు రవి, రజనీ. చుట్టూ పచ్చని పొలాలు. చల్లని గాలి. హాయిగా ఉండేది.

పుష్పవతి అయ్యాక ఆగిపోవలసిన చదువు నిరాహారదీక్ష ద్వారా కొనసాగించే హక్కు సాధించుకుంది రజని. ఆమె బాధ్యత రవికి అప్పగించాడు రామయ్య.

ఒకరోజు జువ్విచెట్టు కింది హోంవర్క్ చేస్తూ చేస్తూ యథాలాపంగా ఆమెవైపు చూశాడు రవి. కాంతివంతమైన విస్ఫారిత నేత్రాలతో ఆమె అతనినే చూస్తోంది. చూపులు కలవగానే రవి గుండె ఝల్లుమంది. ఏదో అలజడి! రొద! కలిసిమెలిసి స్కూల్‌కి వెళ్లివస్తున్నా ఇంతవరకూ వారిమధ్య

నిర్మలస్నేహమే.

ఇప్పుడు మరేదో భావం అని హృదయాన్ని ఛెళ్లున తాకింది. 'కాదు, కాదు! నా హృదయంలో కాదు! ఆమె హృదయంలోనే మరేదో ఉంది' అనిపించింది. నిన్నటి వరకూ కనిపించని కొత్తందాలేవో ఆమెలో పొటమరిస్తున్నాయి. యౌవనానికి దారి ఇస్తూ తప్పుకుంటున్న బాల్యం.. ముఖంలో కొత్తగా చేరిన కళా, కాంతీ! పెద్ద కళ్లతో అందంగా మెరుస్తున్న బెరుకుదనం! నిండు పెదవులను తోసుకుంటూ జాలువారుతున్న దరహాసం.

తను తలవంచుకొని హోంవర్క్ చేస్తున్నంతసేపూ ఆమె తననే చూస్తూన్నదన్న భావం ఎందుకో హాయిగా అనిపించింది.

ఆరాత్రి రవికి నిద్రపట్టనేలేదు. రాత్రంతా వివిధ భంగిమల్లో రజని అతని మదిలో తిష్టవేసి కలవరపరుస్తూనేవుంది!

మర్నాడు సాయంకాలం జువ్విచెట్టు కింది అలవాటు ప్రకారం రవి హోంవర్క్ చేస్తుంటే అలవాటుకి భిన్నంగా - నీమీద మనసాయెరా పాట హమ్మింగ్ మొదలుపెట్టింది రజని! కువకువలాడుతున్న గుండెను అదముకుంటూ - తలెత్తి ఆమెను చూడలేక, చూడకుండా ఉండనూ లేక చూసీ చూడనట్టు చూసి - తర్వాత తదేకంగా చూస్తుండిపోయాడు రవి. "ఏమిటా చూపు? పాత రజనినే కదా" అంది కవ్వింపుగా.

కాదు! పాత రజని కానే కాదు! కవ్వింతల కవితలా కొత్త కొత్తగా ఉంది.

"ఇలా అయితే నీ హోంవర్క్ చెయ్యను ఫో" బుంగమూతి పెట్టాడు.

"ఎలా అయితే?" కొంటెగా అడిగింది.

చెప్పలేకపోయాడు.

"బాబ్బాబూ! హోంవర్క్ చెయ్యవూ?" గడ్డం పట్టుకొని గోముగా బ్రతిమాలింది. అంతకు ముందెన్నోసార్లు ఆమె తాకినా - ఇప్పటి స్పర్శలో ఏదో దగ్గరితనం, ఆత్మీయత! ఏదో థ్రిల్లింత!. "దూరం... దూరం" అన్నాడు నవ్వుతూ చటుక్కున ఆమె ముక్కు పట్టుకుని గుంజుతూ.

అలా ఎందుకు చేశాడో అతనికే తెలియదు.

ఆమె కోపగించుకోలేదు. పైగా పకాపకా నవ్వుతూ కాస్త జరిగింది.

రోజులు గడుస్తున్న కొద్దీ - చుట్టుపక్కల మనుషులెవ్వరూ లేకుంటే - జువ్విచెట్టు కింది చిలిపిచేష్టలూ, కొంటెపనులూ జోరందుకొని వారి ప్రపంచంలో నిన్న లేని అందమేదో మొగ్గ తొడిగింది. ఆ మొగ్గ పూర్తిగా వికసించేలోగా - పరీక్షలూ...ఫలితాలూ... కాలేజీ చదువుకోసం రవి కుటుంబం పట్నంకి మకాం మార్చడం - వరుసగా జరిగిపోయాయి.

వాళ్లు గ్రామం విడిచి వెళ్తున్న రోజు ~ సామాన్లు ప్యాక్ చేస్తూ కబుర్లు చెబుతూ ఓర కంట రవిని గమనిస్తూ రజని వాళ్లింటిలోనే ఉంది. రవి ఒంటరిగా దొరికినప్పుడు ఏదో చెప్పబోయి చెప్పలేక కన్నీళ్లు పెట్టుకున్న రజనిని చూస్తూంటే అతనికికూడా దుఃఖం ముంచుకొచ్చింది.

ఒక బండి నిండా సామాను సర్దేశారు. రెండోబండిలో సగం వరకూ సామాను. మిగిలిన స్థలంలో రవి, అతని తల్లిదండ్రులు... దుర్గాడ వెళ్లి అక్కడ పట్నం బస్సెక్కాలి. బళ్లు బయలుదేరాయి.

బండిలో కూర్చున్న రవి తల్లితో కబుర్లు చెబుతూ గ్రామశివారు వరకు నడిచివచ్చిన రజని కన్నీళ్లతో వెనుదిరిగింది. బండి జువ్విచెట్టును దాటుతున్నప్పుడు రవి హృదయం కలుక్కుమంది. కన్నీటితెర పడి కళ్లు మసకబారాయి.

కాలేజీ చదువుల్లో పడి, ఆ తర్వాత ఉద్యోగప్రయత్నాల్లో తిరుగుతూ క్రమంగా రజనిని మరచిపోయాడు రవి. లేదు, లేదు! మరచిపోయాననుకున్నాడు. కానీ - పదేళ్లపాటు అతని హృదయపేటిక అట్టడుగున భద్రంగా పడున్న రజని జ్ఞాపకాలు - శుభలేఖ చూడగానే ఒక్కసారిగా విజృంభించి వరదలాగా పొంగిపొర్లాయి.

000

తల్లిదండ్రులు రాలేమని చెప్పడంతో రవి ఒక్కడే రజని పెళ్లికి ముందురోజు బయలుదేరాడు. దుర్గాడ చేరుకునేసరికి సాయంకాలం అయింది. తనతో చదువుకున్న చాలామంది అక్కడే ఉంటున్నారు.

రవి ముందుగా సుబ్బారావు ఇంటికెళ్లాడు.

సుబ్బారావు అతని భార్య రవిని ఎంతగానో ఆదరించారు. టిఫిన్ అయ్యాక మిత్రులిద్దరూ తమ చిన్ననాటి హైస్కూల్‌కి వెళ్లారు. వనమహోత్సవం నాడు తాము నాటిన చెట్టు ఇప్పుడు బాగా ఎదిగింది. పాత జ్ఞాపకాలు మోస్తూ ఆ చెట్టుకింద కూర్చున్నారు.

రజని విషయం తనకు తెలిసినదంతా చెప్పాడు సుబ్బారావు.

పదోక్లాస్ పూర్తికాగానే రజనికి ఎన్నో సంబంధాలు చూసినా ఏదీ కుదరలేదు. ఐదేళ్ల క్రితం సినిమా నెపంతో ఫ్రెండ్స్‌తో బండిమీద దుర్గాడ వచ్చి సుబ్బారావును కలిసిందామె. ఎంతో ఉద్వేగంగా కనిపించింది. జీవన్మరణ సమస్య ఎదుర్కొంటున్న దానిలా, రవికెన్ని ఉత్తరాలు రాసినా జవాబు లేదని అడ్రస్ మారిందా అని అడిగింది. మారలేదని తెలిసి - రవి ఎందుకు జవాబు రాయలేదా అని హతాశురాలైంది.

అయితే రవికి ఒక్క ఉత్తరమూ అందలేదు.

సైంధవుడెవరో పుణ్యం కట్టుకొని ఉంటాడు!

"రజని నిన్నెంతగానో ప్రేమించింది రవీ! నీ ఉత్తరాల కోసం ఎదురు చూసి చూసి తపించిపోయింది. చివరకు విరక్తి చెంది ఈ వివాహానికి అంగీకరించింది. ఈ వివాహం సవ్యంగా జరుగుతుందన్న నమ్మకం నాకు లేదు" చెప్పాడు సుబ్బారావు.

రవి హృదయం వికలం అయింది. "ఆమె ఉత్తరం ఒక్కటైనా అందుంటే ... అంది ఉంటే..."


"ఏం చేసేవాడివి?"

రవి తల వాలిపోయింది. ఆమె ఉత్తరం అందినా తనేం చేయగలిగి ఉండేవాడు కాదు. అతనికి తెలుసు కులాలు, ఆర్థిక సమస్య అడ్డువస్తాయని.

"రేపు రాత్రి కదా పెళ్లి. ఉదయమే స్కూటర్ మీద వెళదాం. ఈ రోజు మాఇంట్లోనే ఉండు" చెప్పాడు సుబ్బారావు.

సూర్యుడస్తమించి చాలాసేపైనా పౌర్ణమి కనుక వెలుగుగానే ఉంది.

రజనిని తక్షణం చూడాలన్న



కోరిక విజృంభించి రవి హృదయాన్ని కదిలించివేసింది. "నువ్వు రేపురా. నేనిప్పుడే వెళ్తున్నా" అంటూ లేచాడు. స్కూటర్ మీద దిగబెడతానని సుబ్బారావు అంటున్నా వినకుండా బయలుదేరాడు రవి.

అయితే దారిలో స్నేహితులు ఎదురుకావడంతో వాళ్లని వదిలించుకుని రామాపురం రోడ్డు పట్టేసరికి ఎనిమిది దాటింది.

నిన్నటి వర్షానికి రోడ్డంతా ఎండీ ఎండని బురద. అడుగు తీసి అడుగు వేసేలోగా జారిపోవ డం ఖాయం. జ్ఞాపకాలు నెమరేసుకుంటూ అడుగులో అడుగేసుకుంటూ జాగ్రత్తగా నడుస్తు న్నాడు. తేమగాలి చల్లగా, పచ్చిగా హాయిగా వీస్తోంది.

జువ్విచెట్టు సమీపించగానే రవి అడుగు ముందుకు పడలేదు. జ్ఞాపకాల జడివాన! చెట్టుకింద కాస్సేపు కూర్చోవాలనిపించింది.

అప్పుడు టైం తొమ్మిది. ఓ పావుగంట కూర్చుని బయలుదేరితే పదిలోగా పెళ్లివారిల్లు చేరుకోవచ్చు.

జువ్విచెట్టు కింది కూర్చోగానే జ్ఞాపకాలు తరుముకొచ్చాయి. పరవశంగా ఉంది. అమృతం కురిపిస్తున్న చందమామ. వింజామరలు వీస్తున్నట్టు పిల్లగాలులు... కళ్లు మూతలు పడుతున్నాయి... నిద్ర...

టైం పన్నెండు... ఎవరో దగ్గరగా పిలుస్తున్నట్టనిపించింది. ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు రవి... ఎవరో వస్తున్నారు!

స్త్రీ! అవును స్త్రీయే! అర్ధరాత్రి ఇక్కడ! తనని పిలుస్తూ!

అధాట్టుగా లేచి నిలుచున్నాడు... ఎవరై ఉంటారు?1

రజని! రేపు పెళ్లి కాబోతున్న రజని! పెళ్లికూతురు ముస్తాబులో!

రవి స్తంభించి పోయాడు.

భుజం మీద చేయివేసి "ఆశ్చర్యంగా ఉందా?" మృదువుగా అడిగిందామె.

మిడిగుడ్లేసుకొని అలాగే ఉండిపోయాడు రవి.

అప్పటికీ ఇప్పటికీ రజనిలో ఎంత మార్పు! అప్పటి రజని - బాల్యాన్ని చెరిపేసుకుంటూ యౌవనంలోకి తొంగిచూస్తున్న కసుగాయ. ఇప్పటి రజని - అణువణువూ యౌవనకాంతి నింపుకొని ఊరిస్తున్న దోరజాంపండు!

అప్పుడు కీచుగొంతు... ఇప్పుడేమో వీణానాదం! అబ్బా! ఎంతందంగా ఉంది!... అంతలో ఏదో అనుమానం.

"అర్ధరాత్రి... ఇక్కడికొచ్చావేంటి రజనీ! అసలు నేను వచ్చినట్లు ఇక్కడున్నట్టు నీకెవరు చెప్పారు?" ఉద్వేగంగా అడిగాడు రవి.

"ఎవరూ చెప్పనక్కరలేదు! నాకంతా తెలుసు!" ఆ స్వరం వింతగా వినిపించింది. భయం లేదు, ఆందోళన లేదు, అదురుబెదురూ లేవా స్వరంలో.

ఎవరైనా చూస్తే!... బెరుకుగా ఉంది రవికి.

"నన్నెవరూ ఏమీ చెయ్యలేరు రవీ! నిన్ను ఏమీ చేయలేరు!

ఎంతో ధీమాగా, నిండుగా వినిపించిందామె స్వరం. ఆమె ధైర్యం చూసి రవికీ ధైర్యం వచ్చినట్టుంది. చటుక్కున ఆమె నడుం చుట్టూ చేయివేసి దగ్గరగా లాక్కున్నాడు. మర్నాడే పెళ్లి కావలసిన అమ్మాయిని అలా చేయడం తప్పో ఒప్పో అతనికే అర్థం కావడం లేదు.

అతనిలో ఏదో థ్రిల్లింత! ఏదో తెగింపు!

ఆమె తలలోని పూల పరిమళం మత్తెక్కిస్తోంది. పూసుకున్న గంధం కవ్విస్తోంది. చటుక్కున్న ఆమెను హృదయానికి హత్తుకున్నాడు. కానీ విచిత్రంగా ఆమె పట్టుచిక్కలేదు! గాలిని కౌగలించుకున్నట్టు, పొగమంచును చుంబించినట్లుగా ఉంది. అయితే హృదయం మాత్రం ఏదో అలౌకికానందంతో నిండిపోతోంది. పొంగి పొర్లుతోంది.

ప్రియురాలు పిలిచె రావోయీ అని ఆమె హమ్మింగ్ చేస్తూ చేస్తూ "నాతో వస్తావా రవీ!" అని ఆర్తిగా అడిగింది.

దేవత అడుగుతున్నట్టు అనిపించి "వస్తా" అన్నాడు తమకంగా రవి.

000

తెల్లవారింది. పెళ్లివారింటిలో అంతా ఘొల్లుమంటున్నారు. రాత్రి భోజనం చేసిన రజని తలనొప్పిగా ఉందని తలుపులు బిగించుకొని గదిలో పడుకున్నది పడుకున్నట్లే ఉండిపోయింది. బలవంతపు పెళ్లి చేయబోతే ఆత్మహత్య చేసుకుందని బంధువులు చెవులు కొరుక్కున్నారు.

000

ఉదయం పదిగంటలకు పెళ్లివారింటికి స్కూటర్ మీద దుర్గాడలో బయలుదేరిన సుబ్బారావు జువ్విచెట్టు వద్ద జనం మూగి ఉండడం చూసి స్కూటర్ ఆపి జనాన్ని నెట్టుకుంటూ చెట్టు వద్దకు వెళ్లాడు.

ఆ చెట్టు కింద శవం!

రవి శవం!

000

సుబ్బారావు భార్యకి చెబుతూ చివరకు అన్నాడు " దయ్యాలూ ఆత్మలూ ఉన్నాయో లేవో నాకు తెలియదు. కాని అవి లేవని వాదించే హేతువాదులు - రాత్రి పదిన్నరకు చనిపోయిన రజని పన్నెండుకు జువ్వి చెట్టువద్ద రవిని ఎలా కలిసిందో వివరిస్తే బాగుంటుంది."

"మీరు చూసేటప్పటికి రవి చనిపోయాడు కదా. మరి రాత్రి పన్నెండుకు రజని అతనిని కలిసినట్టు మీకెవరు చెప్పారు?" అడిగింది ఆమె. గంభీరంగా కాస్సేపు ఆలోచించి...

"అదే చిత్రం! కోరికలు తీరక చనిపోయిన వారి ఆత్మలు కొన్ని గంటలపాటు భౌతిక ప్రపంచంలో తేలియాడుతూ ఆత్మీయులకు కనిపి స్తాయని చెబుతూ ఉంటారు. అది నిజమేనేమో! రాత్రి నాకు నిద్రపట్టనేలేదు. పన్నెండు గంటల ప్రాంతంలో నాశరీరం జలదరించింది. నాలో నేను కాక మరెవ్వరో ఉన్నట్లు అనిపించింది! నా ఆలోచనలూ, జ్ఞాపకాలూ, స్పందనలూ నావి కాక మరెవ్వరివో అనింపించింది. అప్పుడు నాకు తెలియలేదు గాని... బహుశా రవి ఆత్మ నాలో ప్రవేశించిందేమోనని ఇప్పుడు అనిపిస్తోంది. ఆ సమయంలో జువ్విచెట్టు కింద రవి పొందిన అనుభూతులన్నీ చిత్రంగా నాలోనూ కలిగాయి. రజని రావడం, ఆమెతో రవి కలవడం, నాతో వస్తావా అని ఆమె అడగడం... అన్నీ నాకు తెలుస్తూనే ఉన్నాయి! ఈ విచిత్ర పరిస్థితిని హేతువాదులెలా వివరిస్తారో తెలుసుకోవాలని ఉంది." ■

